సాక్షి
కామారెడ్డి
గురువారం । 26 । అక్టోబర్ । 2023



వైభవంగా శోభాయాత్ర

జిల్లాలో దుర్గామాత విగ్రహ నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగింది. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 11లో ▸



బీజేపీతోనే అభివృద్ధి

బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఆ పార్టీ జుక్కల్ అభ్యర్థి అరుణతార పేర్కొన్నారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4 /14.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగనుందన్నారు. అలాగే కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో వ్యవసాయ సహకార క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ జరుగుతుందన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు అందరూ తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

చెరుకు టన్నుకు రూ.3,463



నిజాంసాగర్(జుక్కల్): చెరుకు పంట టన్నుకు రూ.3,463 ధరను చెల్లిస్తున్నామని గాయత్రి షుగర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాగి గాయత్రి కార్మాగారంలో చెరుకు క్రషింగ్ యంత్ర పూజ, హోమ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, మాగి గాయత్రి కార్మాగారాల పరిధిలో చెరుకు పండించిన రైతులకు సరైన ధర అందిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క ఫ్యాక్టరీలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. చెరుకు పంట నూర్పిడికి 80 ముఠాలు, 20 యంత్రాలు, 180 వాహనాలను సిద్ధం చేశామని చెప్పారు. వచ్చే నెల 14 నుంచి గాయత్రి కార్మాగారంలో క్రషింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రెసిడెంట్ శంకర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, జనరల్ మేనేజర్ వెంగల్‌రెడ్డి, రాజబాబు, సుధారెడ్డి, గోవింద్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

భరోసా కోసం కవాతు



కామారెడ్డి క్రైం: ప్రజల్లో భరోసా కల్పించడానికి పట్టణాలు, మండల కేంద్రాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సింధుశర్మ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మూడు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కేంద్ర బలగాల అధికారులు బుధవారం ఎస్పీతో సమావేశమయ్యారు. కేంద్ర బలగాలకు జిల్లాకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మూడు కంపెనీల అధికారులు రాజ్ మోహన్‌సింగ్, మనోజ్ కుమార్, డీఎస్పీలు ప్రకాష్, శ్రీనివాస్, జగన్నాథరెడ్డి, సీఐలు మహేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

'దొందూ దొందే'



నవీపేట: నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిపోయిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా అమెరికా వెళ్లిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దొందూదొందేనని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంత్రి తల్లి మంజులమ్మ ఇటీవల మృతిచెందగా అమ్మమ్మ ఊరైన నవీపేటకు మొదటి నిద్రకు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకుండా తప్పించుకు తిరిగారన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న కేసీఆర్‌ను ఓడించేందుకు ఎన్ని కుయుక్తులు పన్నినా.. కేసీఆర్ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు. జిల్లాలోని ఐదు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. సమావేశంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆసోల్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ రావ్, తెడ్డు పోశెట్టి, రాంరెడ్డి, మల్లేష్, లోకం నర్సయ్య, అల్లం రమేష్, గైని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వరపల్లిలో సమావేశమైన రైతు జేఏసీ ప్రతినిధులు

రైతుల మాస్టర్ ప్లాన్

- నామినేషన్ అస్త్రాలతో ఉద్యమ కార్యాచరణ
- ఊరూరూ తిరుగుతున్న జేఏసీ నేతలు

బల్దియాలో మాస్టర్ ప్లాన్ గొడవ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వం రద్దు చేస్తున్నామని చెప్పినా అధికారికంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో మాస్టర్ ప్లాన్ రద్దుపై సీఎం కేసీఆర్ స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో వంద నామినేషన్లు వేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి పట్టణం విస్తరిస్తుండడంతో సుమారు ఏడాది క్రితం బల్దియా అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ ముసాయిదా రూపొందించారు. అయితే ఈ ముసాయిదాలో విలువైన పచ్చని పంట పొలాలను ఇండస్ట్రియల్ జోన్‌లో చేర్చడం, ఇష్టారాజ్యంగా రోడ్ల విస్తరణను ప్రతిపాదించడంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆయా వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. రైతులు ఒక్కటై పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. అప్పట్లో కామారెడ్డి రైతులు చేసిన ఆందోళనలు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకూ విస్తరించాయి. రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ ముసాయిదాను నిలిపివేస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రకటన చేసింది. అయితే ఇప్పటివరకు మాస్టర్ ప్లాన్ విషయంలో ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించలేదు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు..

కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్ ప్లాన్‌లో చేర్చిన టేక్రియాల్, లింగాపూర్, రామేశ్వర్‌పల్లి, పాతరాజంపేట, సరంపల్లి, దేవునిపల్లి, అడ్లూర్, ఇల్చిపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు ఊరికి పది మంది చొప్పున వంద మందికి తగ్గకుండా నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా బాధిత గ్రామాల రైతులు జేఏసీ ఆధ్వర్యంలో సమావేశమవుతూ ఒక్కో గ్రామాన్ని కట్టడి చేసుకుంటున్నారు. కామారెడ్డి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులందరినీ కలుపుకుని మరోసారి ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి రైతు జేఏసీ నేతలు భావిస్తున్నారు. రైతులు సమావేశమై తమ డిమాండ్లను వెల్లడిస్తుండడంతో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి చొరవ ఉంటుందన్న దానిపై చర్చ జరుగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే వీలుండదని, అందుకే సీఎం కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి అండగా నిలిచేవారికే మద్దతు ఇస్తామని రైతు జేఏసీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తమ వెనుక ఎవరూ లేరని, తమ భూములను కాపాడుకునేందుకే ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నామని పేర్కొంటున్నారు. తాతల కాలం నుంచి కాపాడుకుంటూ వస్తున్న భూములు ఇప్పుడు విలువ పెరిగి, కుటుంబాలు ఎదుగుతాయని అనుకుంటున్న సమయంలో మాస్టర్ ప్లాన్ పేరుతో ఇబ్బందులు పెడితే రోడ్డున పడుతామని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

అధికార పార్టీలో టెన్షన్..

మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతామని భావిస్తున్న రైతులు.. ఎన్నికల సమయం కావడంతో ఈ అంశంపై గట్టిగా కొట్లాడాలని నిర్ణయించుకున్నారు. గ్రామాల్లో తిరుగుతూ రైతులతో సమావేశం అవుతున్నారు. మాస్టర్ ప్లాన్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే కామారెడ్డిలో భారీగా నామినేషన్లు వేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో రైతుల నిర్ణయం అధికార పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారే పరిస్థితి కనబడుతోంది. ఎన్నికల సమయంలో అది కూడా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన అంశం తెరపైకి రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలన్న దానిపై నేతలు సమాలోచనలు చేస్తున్నారు. బల్దియా పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన తమ పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్టు మున్సిపాలిటీ తీర్మానం చేసిందని, ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని ప్రకటించిందని గుర్తు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో వేచి చూడాలి.

కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తాం

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు గవర్నర్‌తో సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయించాలని మాస్టర్ ప్లాన్ బాధిత రైతు జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే కామారెడ్డిలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరపల్లిలో బుధవారం రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. తమకు మద్దతు ఇచ్చే పార్టీలకు అండగా ఉంటామన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దుపై స్పష్టత ఇవ్వకపోతే రెండో దశ ఉద్యమానికి సిద్ధం కావాలని, ఇందుకోసం గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించి, రైతులను చైతన్యం చేయాలని తీర్మానం చేశారు. అధికార పార్టీ నేతలు రైతులను బెదిరించడం మానుకోవాలన్నారు. సమావేశంలో మాస్టర్ ప్లాన్ బాధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- జిల్లావ్యాప్తంగా 2.92 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఆరు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- నెలాఖరులో కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు



కామారెడ్డి క్రైం: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమైంది. నెలాఖరులోగా జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు. మరో రెండు మూడు రోజుల్లోగా ధాన్యం సేకరణ ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో జిల్లాలో గతంలో మాదిరిగానే మొత్తం 347 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వాటిలో 325 కేంద్రాలు సింగిల్ విండోల ఆధ్వర్యంలో, 22 కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అందుబాటులో గన్నీ బ్యాగులు

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వానాకాలంలో 2,92,105 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చనే అంచనాలు ఉన్నాయి. ఇంటి అవసరాలు పోను దాదాపు 4.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని భావిస్తున్నారు. కొనుగోళ్లకు సంబంధించి 1.50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం. ఇందులో ఇప్పటికే సగానికి పైగా సంచులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 163 రైస్ మిల్లులు ఉన్నాయి. వాటిలో 36 బాయిల్డ్, 127 రా రైస్‌మిల్లులు ఉన్నాయి. లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

❝ ఏర్పాట్లు చేస్తున్నాం



ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 347 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు తేమ శాతం సరిగా ఉండేలా ధాన్యం ఆరబెట్టాలి.

– అభిషేక్ సింగ్, డీఎం, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్, కామారెడ్డి

సాఫీగా సాగేలా..

జిల్లాలోని బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, పోచారం, నిజాంసాగర్ లాంటి ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు ఊపందుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు తెరుచుకుంటాయా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మేలు రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, బి–గ్రేడ్ రకానికి రూ.2,183 మద్దతు ధరగా నిర్ణయించింది. తేమ శాతం సరిగ్గా ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబోసి కేంద్రాలకు తీసుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవడం, ప్రక్రియ మొత్తం సాఫీగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇదివరకే రైస్ మిల్లర్లు, రెవెన్యూ, రవాణా, సహకార శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

కొనసాగుతున్న సస్పెన్స్

- వెలువడని కాంగ్రెస్ రెండో జాబితా
- ఆశావహులు, శ్రేణుల్లో ఉత్కంఠ

సాక్షి, కామారెడ్డి: ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాపై అదే ఉత్కంఠ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ బుధవారం సమావేశమైనా రాత్రి వరకు రెండో జాబితా ప్రకటించకపోవడంతో ఆశావహులతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థుల ప్రకటనతో పాటు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుంటే, అభ్యర్థులెవరో తేల్చకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ పోటీ చేస్తాడని భావిస్తున్నారు. అయితే ఇక్కడ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం జరగడంతో ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఎల్లారెడ్డిలో సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావులలో ఎవరో ఒకరు అభ్యర్థి అవుతారని భావిస్తున్నా, ఇక్కడ కూడా తెరపైకి కొత్త పేర్లు వస్తుండడంతో ఆ పార్టీ నేతల్లో అయోమయం నెలకొంది. బాన్సువాడలోనూ పరిస్థితి ఇలాగే ఉంది. స్థానికులకే టికెట్టు ఇవ్వాలని అక్కడి నేతలు డిమాండ్ చేస్తున్నారు. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాం టికెట్టు రేసులో ఉన్నారు. ఇక్కడ లక్ష్మీకాంతరావ్ పార్టీ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీంతోకాంగ్రెస్ నాయకత్వం అభ్యర్థులను ఎప్పుడు ఖరారు చేస్తుందో, ఎవరికి అవకాశం దక్కుతుందో అన్న విషయమై పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్‌లోకి బీజేపీ నేత?

బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీజేపీ కీలక నేత ఒకరు కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జరుగుతోంది. సదరు నాయకుడు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నేతలతో కలిసి ఢిల్లీకి చేరుకుని టికెట్టు కోసం ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. దీంతో ఏ నియోజకవర్గంలో ఎవరికి టికెట్టు వస్తుందోనన్న అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

కామారెడ్డిటౌన్: కామారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు వెళ్లే దారిలో ఉన్న సెల్ టవర్‌పైకి ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. వివరాలు.. కామారెడ్డిలోని వడ్లగల్లిలో నివాసం ఉంటున్న బెజ్జంకి ఓంకార్ బుధవారం మధ్యాహ్నం 01:30 గంటలకు టవర్ ఎక్కుతుండగా సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓంకార్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ స్థలం ఉందని, పట్టణానికి చెందిన ఓ లాయర్, టౌన్ బిల్డర్, ప్రభుత్వ హెచ్‌ఎం కలిసి భూమిని లాక్కున్నారని ఆరోపించాడు. తనకు న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఓంకార్ అన్నారు. పోలీసులు వాధించినా వినలేదు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తే కొట్టి పంపించారని అందుకే టవర్ ఎక్కానని ఆవేదన వ్యక్తం చేశాడు. పేదలకు న్యాయం చేసే బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రమణారెడ్డి వచ్చి హామీ ఇస్తే దిగుతానని లేకుంటే కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. భార్య జ్యోతి, బంధువులు వచ్చి నచ్చజెప్పినా వారితో వాధించాడు. సీఐ నరేష్ సముదాయించి, కిందికి దిగి ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడటంతో సాయంత్రం 5:30 గంటలకు టవర్ దిగాడు. దీంతో బంధువులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట 765 సర్వే నంబర్‌లోని తన ఎకరంన్నర భూమిని కొందరు కబ్జా చేశారని, ఆ భూమిని ఇప్పించాలని ఓంకార్ కోరారు.



సెల్ టవర్‌పై ఓంకార్

సైబర్ మోసాల బాధితులు 1930కు ఫోన్ చేయాలి

ఎల్లారెడ్డి: సైబర్ మోసాల బాధితులు 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. సైబర్ మోసాలకు పాల్పడేవారు.. మీ ఫోన్‌లకు బహుమతులు వచ్చాయని, లక్కీ డ్రా వచ్చిందని ఫోన్‌లు చేసి మోసం చేస్తారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలను చెప్పాలని అన్నారు.

ఇంజినీరింగ్ కార్యాలయానికి వాస్తు దోషమట!



పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయానికి కొత్తగా ఏర్పాటు చేసిన గేటు



పాత గేటును సగం మూసివేసి, చిన్న గేటు పెట్టిన దృశ్యం

కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో ఉన్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ జిల్లా కార్యాలయానికి వాస్తుదోషం ఉందట. దీంతో ఇంజినీరింగ్ అధికారులు ప్రధాన గేటును మార్చారు. ఇంతకుముందు ఉన్న గేటు వద్ద సగభాగాన్ని గోడతో మూసివేశారు. అక్కడ చిన్న గేటును ఏర్పాటు చేసి, మెయిన్ గేటును దిగువ భాగంలో కొత్తగా ఏర్పాటు చేశారు. ఇక్కడ పని చేసిన అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అందుకే వాస్తు చూయించుకుని మెయిన్ గేటును మార్చినట్లు చర్చించుకుంటున్నారు. – సాక్షి, కామారెడ్డి

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'



భిక్కనూరు: కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించి, సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం భిక్కనూరులో పలు కులసంఘాల సభ్యులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, అంటే పదేళ్లలో నియోజకవర్గం ఏమీ అభివృద్ధి చెందలేదని వారు ఒప్పుకున్నట్లేనని పేర్కొన్నారు. రైతులు ధరణితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియోజకవర్గంలో దళారి వ్యవస్థ విపరీతంగా ఉందని, ఆ వ్యవస్థను పూర్తిగా తొలగించి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అధికారంలో లేనప్పుడే ప్రజలకు అవసరమైన పనులను చేశానన్నారు. ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి నేతలు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు, ఉప్పరి రమేష్, బస్వారెడ్డి, గణేష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఏక్‌నాథ్, బాల్‌లింగం, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి ఆరు గ్యారంటీలిస్తున్నాం'

భిక్కనూరు: అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలు అభివృద్ధి చెందుతారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం బస్వాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ప్రాంతానికి విద్యుత్ సరఫరాతో పాటు తాగు, సాగునీటి సౌకర్యాల విషయంలో శాసనమండలిలో తనను మెచ్చుకున్న కేసీఆర్.. ఇప్పుడు తనపైనే పోటీకి రావడం సిగ్గు చేటన్నారు. అభివృద్ధి కోసమే కేసీఆర్ ఇక్కడికి వస్తున్నారని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కామారెడ్డి అభివృద్ధి చెందలేదని వారు స్వచ్ఛందంగా ఒప్పుకున్నట్లేనన్నారు. అధికారంలోకి రాగానే హామీలను నెరవేర్చడంతోపాటు పార్టీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, కౌన్సిలర్ శివకృష్ణమూర్తి, నాయకులు సిద్ద రాములు, బాగారెడ్డి, ఎల్లం, జీవన్, యాదగిరి, మల్లేష్, రవి, కుమ్మరి చంద్రం తదితరులు పాల్గొన్నారు.



'సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి'



కామారెడ్డి క్రైం: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి బల్దియా పరిధిలోని రామేశ్వర్‌పల్లి, ఇందిరా నగర్, ఇస్లాంపురా, గొల్లవాడ, దోమకొండ మండలం సంగమేశ్వర్, అంబారిపేట, సీతారాంపల్లి, బీబీపేటలకు చెందిన పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కామారెడ్డి నుంచి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, నాయకులు కొమ్ముల తిర్మల్‌రెడ్డి, నిట్టు వేణుగోపాల్‌రావు, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, గంగ్ర మధుసూదన్, ఫిరంగి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆర్మూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వినోద్‌కుమార్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజవర్గంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు గ్రామీణ, పట్టణ స్థాయిలో అనుసరించాల్సిన మోడల్‌కోడ్ విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్, ఆలూర్ తహసీల్దార్లు గుండు అల్వార్‌శ్రీకాంత్, దత్తాద్రి, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, కార్యదర్శులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి



నిజామాబాద్ నాగారం: ప్రజలు మరో అవకాశం ఇస్తే అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ఎంకే గార్డెన్స్‌లో వంజరి ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని, మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తూ ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. నగర ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు మినీ ట్యాంక్ బండ్‌ను అద్భుతంగా నిర్మించినట్లుప పేర్కొన్నారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు కేసీఆర్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు మాయవార్ సవితారాజు, నిచ్చెంగు లతాకృష్ణ, మాయవార్ సాయిరాం, ధాత్రిక పరమేశ్వర్, కరిపె సత్యం, గంగోనె గంగాధర్, కరిపె రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ ఓటర్ల విభిన్న తీర్పు

- 1952లో ఏర్పడ్డ నియోజకవర్గం
- గతంలో కాంగ్రెస్ కంచుకోట
- ప్రస్తుతం పాగా వేసిన బీఆర్ఎస్
- 15సార్లు సాధారణ, ఒకసారి ఉప ఎన్నిక
- కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 2సార్లు ప్రాతినిధ్యం
- స్వతంత్ర, సోషలిస్ట్, టీడీపీ, ప్రజారాజ్యం నుంచి ఒకొక్కరికి అవకాశం



మోర్తాడ్ : బాల్కొండ నియోజకవర్గానికి పలు దఫాలుగా నిర్వహించిన ఎన్నికల్లో విభిన్నమైన తీర్పును ఇస్తు ఓటర్లు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. రాష్ట్రంలో ఒక పార్టీ అధికారంలో ఉంటే బాల్కొండకు ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే మరో పార్టీకి చెందిన వారు ఉండటం ఈ నియోజకవర్గ ప్రత్యేకత. 1952లో ఏర్పడ్డ బాల్కొండ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 15 సార్లు సాధారణ, ఒకసారి ఉప ఎన్నిక జరిగింది.

విభిన్నమైన తీర్పులో..

గడిచిన ఎన్నికలు, ఫలితాలను పరిశీలిస్తే శాసనసభ ఎన్నికల్లో ఒక తీర్పును ఇచ్చిన ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం మరో తీర్పును వెల్లడించారు. అలాగే స్థానిక సంస్థలకు నిర్వహించిన ఎన్నికల్లో మరింత భిన్నమైన తీర్పును ఇస్తూ ఓటర్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

స్పీకర్‌గా ఒకరు.. మంత్రులుగా ఇద్దరు..

1952లో సోషలిస్టు అభ్యర్థి అనంత్‌రెడ్డి మొదటగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1957లో కాంగ్రెస్ నుంచి తుమ్మల రంగారెడ్డి, 1962, 1967, 1972, 1978లో కాంగ్రెస్ నుంచి అర్గుల్ రాజారాం ఎన్నికయ్యారు. అర్గుల్ రాజారాం జౌళి, చేనేత, చక్కెర పరిశ్రమల శాఖ మంత్రిగా, విద్యుత్, పశుసంవర్ధక శాఖ మంత్రిగా కొనసాగారు. 1981లో అర్గుల్ రాజారాం మృతితో జరిగిన ఉప ఎన్నికలో ఆయన సతీమణి కాంగ్రెస్ నుంచి సుశీలాబాయి, 1983లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గడ్డం మధుసూదన్‌రెడ్డి, 1985 ఎన్నికల్లో టీడీపీ నుంచి మధుసూదన్‌రెడ్డి గెలుపొందారు. 1989, 1994, 1999, 2004లో కాంగ్రెస్ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి వరుసగా ఎమ్మెల్యేగా విజయం సాధించి అర్గుల్ రాజారాం రికార్డును చేరుకున్నారు. 2004లోనే సురేష్‌రెడ్డి శాసనసభ స్పీకర్‌గా ఎంపికయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఈరవత్రి అనిల్ విజయం సాధించారు. 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డి గెలుపొందారు. ప్రస్తుతం ఆయన రోడ్లు భవనాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. 1994, 1999లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండగా బాల్కొండలో మాత్రం కాంగ్రెస్‌కే విజయం దక్కింది. 1994లో తెలంగాణ నుంచి సురేశ్‌రెడ్డి ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎంపిక కావడం విశేషం. 2004లో కాంగ్రెస్ అధికారంలో వస్తే ప్రతిపక్ష పార్టీకి చెందిన అనిల్ అసెంబ్లీలో కాలుమోపారు. ఆ తరువాత జరిగిన పరిణామాలతో ఈరవత్రి అనిల్ కాంగ్రెస్‌లో చేరారు. ఇలా ఎన్నో విధాలుగా విభిన్నమైన తీర్పును ఇస్తు బాల్కొండ నియోజకవర్గం ప్రజలు తమ విలక్షణతను చాటుకుని అందరి దృష్టిని ఆకర్షించారు.

నాలుగుసార్లు.. అర్గుల్ రాజారాం, కేఆర్ సురేశ్‌రెడ్డి ఎన్నిక

నియోజకవర్గానికి మొత్తం 16 సార్లు జరిగిన ఎన్నికల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. ఇందులో గడ్డం సుశీలాబాయి ఒక్కరే మహిళా ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. కాగా అర్గుల్ రాజారాం కాంగ్రెస్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా ఆయన రికార్డును అదే పార్టీకి చెందిన కేఆర్ సురేశ్‌రెడ్డి అందుకున్నారు. గడ్డం మధుసూదన్‌రెడ్డి మాత్రం రెండ్లు మార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సేవలు అందించారు. సోషలిస్టు పార్టీకి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థికి ఒకసారి, టీడీపీకి ఒకసారి, ప్రజారాజ్యం పార్టీకి ఒకసారి, బీఆర్ఎస్‌కి రెండుసార్లు పట్టం కట్టిన నియోజకవర్గ ప్రజలు పదిసార్లు కాంగ్రెస్ పార్టీకి పెద్ద పీట వేశారు.

నియోజకవర్గం ఓటర్ల సంఖ్య

పురుషులు:	99,728
మహిళలు:	1,15,898
ఇతరులు:	2
మొత్తం:	2,15,628

బాల్కొండ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు

సంవత్సరం	పేరు	పార్టీ	సంవత్సరం	పేరు	పార్టీ
1952–57	కె.అనంత్‌రెడ్డి	సోషలిస్ట్	1985–89	గడ్డం మధుసూదన్‌రెడ్డి	టీడీపీ
1957–62	రంగారెడ్డి	కాంగ్రెస్	1989–94	కేఆర్ సురేశ్‌రెడ్డి	కాంగ్రెస్
1962–67	అర్గుల్ రాజారాం	కాంగ్రెస్	1994–99	కేఆర్ సురేశ్‌రెడ్డి	కాంగ్రెస్
1967–72	అర్గుల్ రాజారాం	కాంగ్రెస్	1999–04	కేఆర్ సురేశ్‌రెడ్డి	కాంగ్రెస్
1972–78	అర్గుల్ రాజారాం	కాంగ్రెస్	2004–09	కేఆర్ సురేశ్‌రెడ్డి	కాంగ్రెస్
1978–81	అర్గుల్ రాజారాం	కాంగ్రెస్	2009–14	ఈరవత్రి అనిల్	ప్రజారాజ్యం
1981–83	గడ్డం సుశీలాబాయ్	కాంగ్రెస్	2014–18	వేముల ప్రశాంత్‌రెడ్డి	బీఆర్ఎస్
1983–85	గడ్డం మధుసూదన్‌రెడ్డి	స్వతంత్ర	2018–23	వేముల ప్రశాంత్‌రెడ్డి	బీఆర్ఎస్

నేడు ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ

ఎడపల్లి: మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలను గురువారం నిర్వహించనున్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా దసరా అనంతరం పౌర్ణమికి ముందు ఇక్కడ భిన్నంగా బతుకమ్మ పండుగ జరుగుతుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా భిన్నంగా బతుకమ్మ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. గ్రామంలో భారీ ఎత్తున పూల బతుకమ్మలను తయారు చేయడం ఇక్కడి ప్రత్యేకత. నేటి బతుకమ్మ పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే షకీల్ ఎడపల్లికి రానున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్ ఇంట్లో కవిత బతుకమ్మను పేర్చి దేశ్‌ముఖ్ గడిలో బతుకమ్మ ఆడనున్నారు.

ఆనవాయితీగా కొనసాగుతోంది

మండలంలో బతుకమ్మ పండుగ దసరా తరువాత జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

– రజితా యాదవ్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్

రామాలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సరోజనమ్మ

వర్ని: కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కు కేటాయించడంతో ఆయన మాతృమూర్తి కల్వకుంట్ల సరోజనమ్మ మోస్రా మండలంలోని రామాలయాన్ని సందర్శించి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గతంలో కూడా ఎన్నికల సమయంలో ఆలయాన్ని దర్శించుకొని ప్రచారాన్ని ప్రారంభించగా గెలుపొందినట్లు ఆమె గుర్తు చేశారు. మోస్రా రామాలయ అర్చకుడు శ్రీనివాస చార్యులు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ పిట్ల శ్రీ రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నివేదికపై నీలి నీడలెందుకు..!

బాల్కొండ: ఎస్సారెస్పీలో మారుతున్న ప్రాజెక్టు నీటి నివేదికను వెల్లడించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ప్రాజెక్టు నీరు రంగు మారడంతో కలెక్టర్ వచ్చి పరిశీలించారు. అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు నీటిని ల్యాబ్‌కు పంపించినా ఇప్పటి వరకు నివేదిక అందలేదు. ప్రాజెక్ట్ ఎగువన ఉన్న ధర్మాబాద్ వద్ద ఓ ప్రముఖ కంపెనీకి సంబంధించిన రెండు ఫ్యాక్టరీల వ్యర్థాలు ఇందులో వదలడంతోనే నీరు రంగు మారుతుందనే అనుమానం బలంగా వినిపిస్తోంది. అంతేకాకుండా ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని నివేదికలను సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీటి నివేదికకు రెండు నెలల సమయం ఎందుకు పడుతుందని ఇందులో ఏదో మర్మం ఉందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నివేదికను బయట పెట్టకుండా పెద్దల ఒత్తిడితో అధికారులను దాస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్ట్ నీటిని పరీక్షల కోసం సంగారెడ్డి ల్యాబ్‌కు శాంపిళ్లను పంపించామని, ఇప్పటి వరకు నివేదిక అందలేదని ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి పేర్కొన్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిజాంసాగర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి అన్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో కార్డన్ సెర్చ్, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వొద్దని, ధ్రువపత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలన్నారు. సమావేశంలో బాన్సువాడ రూరల్ సీఐ మురళి, ఎస్సైలు రాజశేఖర్, విజయ్‌కొండ, కోనారెడ్డి, నాయకులు రాములు, నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి బైక్‌పై నుంచి కిందపడ్డ యువకుడికి తీవ్రగాయాలు కావడంతో దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు బుధవారం తెలిపారు. పీఎస్ పరిధిలో నితిన్, శ్రీనివాస్(17) అనే ఇద్దరు యువకులు బైక్‌పై అజాగ్రత్తగా వెళ్తుండగా కింద పడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్ (17) తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

బాల్కొండ: మండలంలోని బోదెపల్లికి చెందిన ఇద్దరి నిందితులకు ఆర్మూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దీప్తి ఏడాది జైలు శిక్షను విధించినట్లు ఎస్సై గోపీ బుధవారం తెలిపారు. గతేడాది బోదెపల్లి శివారులో కాలువకు అమర్చిన పంపుసెట్లను అదే గ్రామానికి చెందిన నోముల వినయ్, ఎల్లప్ప చోరీ చేయడంతో కేసు నమోదైంది. దీంతో నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణలో చోరీ చేసినట్లు రుజువు కావడంతో జడ్జి నిందితులకు ఏడాది పాటు జైలు శిక్షను విధించినట్లు వెల్లడించారు.

క్రైం కార్నర్

గల్ఫ్‌లో గుండెపోటుతో ఒకరి మృతి



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌కు చెందిన లింగంపల్లి నర్సయ్య(45) బహ్రెయిన్ దేశంలో మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. మృతుడు మూడేళ్ల క్రితం ఉపాధి కోసం బహ్రెయిన్‌కు వెళ్లాడు. సెలవుపై స్వదేశానికి వచ్చేందుకు మంగళవారం బహ్రెయిన్ ఎయిర్‌పోర్ట్‌లో బోర్డింగ్ కోసం వేచి చూస్తుండగా గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అక్కపై చెల్లి దాడి

ఆర్మూర్‌టౌన్: డబ్బుల విషయంలో ఏర్పడిన తగాదాలో అక్కపై దాడి చేసి గాయపర్చిన చెల్లెలుపై కేసు నమోదైనట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో నివాసముండే శ్రావణి మామిడిపల్లిలో నివాసముండే చెల్లెలు సౌమ్య మధ్య డబ్బుల విషయంలో విభేదాలున్నాయి. కాగా సౌమ్య బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శుభకార్యానికి హాజరైన అక్క, బావలపై దాడికి దిగింది. దాడిలో అక్క శ్రావణి తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సౌమ్యపై కేసు నమోదు చేశారు.

పత్తి చేనులో గంజాయి మొక్కలు



పెద్దకొడప్‌గల్: పోచారం గ్రామ శివారులోని పత్తి చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ స్వప్న మాట్లాడుతూ.. పత్తి చేనులో గంజాయి మొక్కలు నాటినట్లు సమాచారం అందడంతో దాడి చేసి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రాంకుమార్, ఏఎస్సై రాములు, సిబ్బంది రాజన్న, ఉత్తమ్, శ్రీను, ప్రసాద్, సాయి శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా మద్యం తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోనారెడ్డి బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా మండల కేంద్రం నుంచి కుబ్యానాయక్ తండాకు ఒకరు మద్యం తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుర్గామాత విగ్రహాన్ని ఢీకొన్న డీసీఎం వ్యాన్

- దెబ్బతిన్న విగ్రహం
- ఆందోళన వ్యక్తం చేసిన ముదిరాజ్ సంఘం సభ్యులు



వ్యాన్ ఢీకొనడంతో దెబ్బతిన్న విగ్రహం



బీసీ సంఘాల సభ్యులతో చర్చలు జరుపుతున్న పెద్దమనుషులు

సదాశివనగర్: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన దుర్గామాత శోభాయాత్ర గొడవకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో మంగళవారం దుర్గామాత శోభాయాత్ర ప్రారంభమైంది. ముదిరాజ్ సంఘానికి సంబంధించిన దుర్గామాత విగ్రహాన్ని శోభాయాత్రకు తరలిస్తుండగా అదే సమయంలో రెడ్డి యూత్‌కు సంబంధించిన డీసీఎం డీజే వ్యాన్‌ను తీసుకెళ్తున్నారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ రెడ్డి వర్గానికి చెందినవాడు కావడంతో కావాలనే తమ దుర్గామాత విగ్రహాన్ని ఢీకొన్నాడని దీంతో దుర్గామాత చేతులు విరిగి పోయాయని, వెనుక ఉన్న ఇనుప స్టాండ్ ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరి వ్యక్తులపై పడి ప్రమాదం సంభవించేదని వారు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో సంఘ సభ్యులు డీసీఎం వ్యాన్ అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని గొడవ పడొద్దని సూచించినా వారు వినలేదు. బుధవారం ఉదయం విగ్రహం ధ్వంసమైన చోటే టెంట్ వేసుకుని 8 గంటల పాటు ఆందోళన చేపట్టారు. సీఐ రామన్ పోలీస్ బందోబస్తు మధ్య ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల సభ్యులతో మాట్లాడారు. విగ్రహం ధ్వంసం కావడానికి కారకులైన రెడ్డి సంఘం నుంచి రూ. 5లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా పెద్ద మనుషుల ఒప్పందంతో రెండు తులాల బంగారం కొనుగోలు చేసి ఇస్తామని రెడ్డి సంఘం వారు చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. విరిగిన దుర్గామాత చేతులను ప్లాస్టర్‌తో అతుకబెట్టి పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, బీసీ ఐక్యవేదిక ప్రతినిధులు బొంబాయి మల్లయ్య, బంజ శివకుమార్, పున్నం రాజయ్య, మర్కంటి దాకయ్య, జగ్గ బాల్‌రాజు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మోహన్ (ఫైల్)

నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన కోట్ల మోహన్(38) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోహన్ వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ప్రతి రోజు పొలంలో నీరు పెట్టేందుకు బుధవారం ఉదయం వెళ్లగా బోరు వద్ద తెగిన విద్యుత్ తీగను గమనించక తొక్కడంతో విద్యుదాఘాతం సంభవించింది. దీంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

గడ్కోల్‌లో గేదె..



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో మలావత్ మల్లేశ్‌కు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గేదె మేత మేస్తుండగా సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరాడు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

రెంజల్: రెంజల్ శివారులోని మొండివాగు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నారాయణ కాంబ్లే(56) బుధవారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ నుంచి అంబేద్కర్‌నగర్‌కు వెళ్తున్న నారాయణకాంబ్లే రెంజల్ శివారుకు చేరుకోగానే ఎదురుగా ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ నుంచి నీలా గ్రామానికి వస్తున్న వ్యక్తి మితిమీరిన వేగంతో ఢీకొన్నాడు. ఈ ఘటనలో నారాయణకు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్తులు చెప్పారు.

ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కుమార్‌ను సంప్రదించగా ప్రమాదం విషయం తమ దృష్టికి వచ్చిందని బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయాలేదని పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన కొక్కుల గంగాధర్ (57) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. టైలరింగ్ పని చేసే గంగాధర్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జబర్దస్త్ ఫేమ్ ఫైమా తండ్రికి గాయాలు

దోమకొండ: జబర్దస్త్ ఫేమ్ ఫైమా తండ్రి సలీంకు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని స్థానిక బీబీపేట రోడ్డుపై స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో స్కూటీ ఢీకొన్నది. ఈ ఘటనలో సలీంకు తలకు గాయం కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.